# సెలెక్షను

చిన్నం వెంకటరాజు

పండుగ దగ్గరపడింది. కొత్తబట్టలకి రకరకాల గుడ్డలు తెచ్చి ఇంట్లో పడేశారు నాన్నగారు ఎవరికి కావలసినరకం వాళ్ళని సెలెక్టు చేసుకోమని. అందరం ఎవరికి కావలసినవి వాళ్ళం సెలెక్టు చేసుకున్నాం గాని చెల్లాయి గౌనుకు ఎల్లాంటి గుడ్డ తియ్యాలా అన్నచోటే వచ్చింది సమస్య అంతాను.

అమ్మ చక్కగా పెద్ద పెద్ద పువ్వులూ లతలూ ఉన్న గుడ్డ తీసి కుట్టిద్దామంది. చిన్నపిల్లలకి పెద్ద పువ్వులైతే అంత బాగుండవు, మరీ 'గాడీ'గా ఉంటుందని ఏవో చిన్న చిన్న పువ్వులో చుక్కలో ఉన్న గుడ్డఅయితే ముచ్చటగా ఉంటుందనీ నేను ఒక సవరణ ప్రతిపాదించాను. కాని మా అన్నయ్యకి ఇవేమీ నచ్చలేదు. పువ్వులూ గివ్వులూ ఏమీ పనికిరావు. తెల్లటి గుడ్డయే ఫేషననీ వాడివాదం. చెల్లాయి గౌనుకు తీయబోయేగుడ్డ గళ్లూగీతలూ ఏమీ లేకుండా ఉండాలని, తప్పితే లైటు కలరులో ఉండవచ్చుననీ వాడు పట్టుపట్టాడు!

నాన్నగారు ఈ గొడవేమీ లేకుండా శుద్ధఖద్దరు కుట్టించేస్తే బావుంటుం దన్నారుగాని దానికి మేమంతాకూడా వ్యతిరేకించాము. (ఖద్దరుచంటిపిల్లలకు మరీమోటుగా ఉంటుందని వద్దన్నామేగాని మా దేశభక్తిని శంకించేరు సుమండీ!). ఆయన ప్రతిపాదన ఏకగ్రీవంగా వ్యతిరేకించబడటంచేతనున్నూ ఫలానారకం గుడ్డయేఉండాలని ఆయనకి అంతపట్టుదల లేకపోవడంచేతనున్నూ ఆయన ఆగొడవేదోమీరే తేల్చుకోండని ఊరుకున్నారు.

ఇక మాతమ్ముడి వ్యక్తిగతాభిప్రాయాలు వాడికి ఉండనే ఉన్నాయి. ఇప్పుడు చాలామంది తొడుక్కుంటున్న 'ఆవారా' గౌనులో చెల్లెమ్మను చూడాలని వాడుచాలా ముచ్చటపడ్డాడు కాని వాడి గొడవనెవరూ లెక్కచెయ్యనే లేదు.

ఇక నేనూ,అమ్మా అన్నయ్యా మాత్రం పోటీలో మిగిలాం. నాది కేవలం ఒకసవరణ మాత్రమేకావటంచేత అమ్మకూ అన్నయ్యకే పడింది పెద్దపోటీ. వీళ్ళ అభిరుచులు మరీ ఉత్తరదక్షిణాలలాగా పరస్పరవ్యతిరేకంగా ఉండటమే గాక పట్టుదలలో ఇద్దరూ భల్లూకపుపట్టు గలవాళ్ళే కావటంచేత గట్టి పోటీయేర్పడింది. ఎవరు నెగ్గుతారో చూడాలని మాకందరికీ కుతూహలంగానే ఉన్నా,ఒక మూల గుండెలలో పీచుపీచుమంటూ ఉన్నది. అన్నయ్య ఓడిపోయినాడా, ఏదో ఒకవంక పెట్టి మా మీద విరుచుకు పడి, ఎవరికోవకరికి నాలుగు వడ్డించేదాకా వాడికి ఆ కసితీరదు. అమ్మమాట చెల్లకపోయిందా ఇక విసవిసలు రుసరుసలు చెప్పనక్కర్లేదు. ఎలాగైనా వీళ్ళిద్దరికీ రాజీకుదిర్చి పండుగ సవ్యంగాగడిచి పోయేలా చూచి పెట్టమని ఆంజనేయస్వామికి మొక్కుకున్నాం.

* * *

అంత లేతకాకుండా అంత ముదురూకాకుండా ఉన్న ఎఱ్ఱరంగు గుడ్డ సెలక్టు కావటంతో సమస్య సవ్యంగానే ఫైనలైందని చెప్పవచ్చు. గళ్ళూ గీతలూవగైరా ఏమీలేకుండా సాఫీగానే ఉండడం వలన అన్నయ్యా, రంగులో 'డాబు'గానే ఉండటంవలన అమ్మా ఏదో విధంగా సంతృప్తిపడి ఊరుకున్నారు.

నాన్నగారు గుడ్డ దర్జీకిచ్చారు; సాయంత్రానికే గౌను వచ్చేసింది కూడా.

ఇంతగొడవ జరిగాక సెలక్టు చెయ్యబడినగుడ్డ ఎలా ఉంటుందో చూద్దామని గౌను చెల్లాయికి తొడిగాం. తనని తానే ఒకసారిఎగాదిగా చూచుకొని భోరుమని రాగాలు ప్రారంభించింది చిట్టి చెల్లాయి! ఎఱ్ఱగా ఉన్న గుడ్డని చూచి గాభరాపడిందో — లేక ఆగుడ్డ తనఅభిరుచులకి సరిపడలేదనో! ఔనుమరి. మేమంతా కూడా మా మా అభిరుచుల్ని దానినెత్తిన రుద్దడానికే చూచాంగాని దాని గౌను విషయంలోనైనా దాని అభిప్రాయాన్ని తీసుకున్నామా ఏమన్నానా? ★